క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



రఘునాథపల్లి: జనగామ రూరల్ సీఐగా ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రఘునాథపల్లి సర్కిల్ కార్యాలయంలో భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ వరంగల్ కమిషనరేట్ ఐటీ సెల్‌కు బదిలీ కాగా, వరంగల్ వీఆర్ ఐటీ సెల్‌లో పని చేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. భాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌రెడ్డిని ఎస్సై దూదిమెట్ల నరేష్, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్ సీఐగా వేణు..



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నూతన ఎస్‌హెచ్‌ఓ(సీఐ)గా జి.వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ సీఐగా పనిచేస్తున్న ముస్కు రాజు బదిలీపై హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి వెళ్లగా ములుగు జిల్లా ఎస్‌బీ నుంచి వేణు స్టేషన్‌ఘన్‌పూర్ నూతన సీఐగా వచ్చారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ఏసీపీని కలిసిన సీఐ

ఘన్‌పూర్ నూతన సీఐ వేణు స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ భీమ్‌శర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

చిల్పూరు ఎస్సైగా నవీన్‌కుమార్



చిల్పూరు: స్థానిక ఎస్సైగా సిరిపురం నవీన్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

స్నేహితుల దినోత్సవం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు నెలలోని మొదటి ఆదివారం నిర్వహించే ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, ఉపాధ్యాయులు గుడెల్లి వెంకటకిషన్ ప్రసాద్, రవీందర్, ఖలీల్, మహేష్, అనిత, రజిత, బిట్ల లావణ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పోటీ పరీక్షలు దోహదం

జఫర్‌గఢ్: విద్యార్థుల విద్యాభివృద్ధికి పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని మండల నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విద్యా వనరుల కేంద్రంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నరేష్, సీఆర్‌పీలు పుట్ట స్వామి, ఎం బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ




పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరాచారి, తహరా పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

బచ్చన్నపేట/జఫర్‌గఢ్: భవన నిర్మాణ రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జేరిపోతుల రాజు కోరారు. సోమవారం కార్మిక సంఘం 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బచ్చన్నపేటలో జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు నాగయ్య, కుక్కుడాల పుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే జఫర్‌గఢ్ మండల కేంద్రంలో సంఘం నాయకులు, కార్మికులు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సముద్రాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తీగల తొలగింపు



బచ్చన్నపేట: మండలంలోని వీఎస్‌ఆర్ నగర్ నుంచి ఆలింపూర్ గ్రామాల మధ్య రైతుల బావి వద్ద కరెంట్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకొని విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. కాగా, 'కరెంట్ స్తంభానికి తీగల పందిరి ' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించారు. కరెంట్ తీగలకు ఎలాంటి తీగలు అల్లుకోకుండా చూసుకుంటామని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



తరిగొప్పుల: ర్యాలీలో పాల్గొన్న అధికారులు తదితరులు



జనగామ: 20వ వార్డులో కౌన్సిలర్ లక్ష్మీశ్రీశైలం

సాక్షి నెట్‌వర్క్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు మండల కేంద్రాల్లో అధికారులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మండల ప్రత్యేక అధికారులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీఈఓ కె.రాము, జిల్లా మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, ఆర్డీఓ వెంకన్న, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నియామకం లేకుండా పచ్చదనం ఎలా?

- కౌన్సిల్ సమావేశంలో అధికారుల నిలదీత



మాట్లాడుతున్న మహంకాళి హరిశ్చంద్రగుప్త

జనగామ: పట్టణంలోని జనాభా పెరుగుదలకు అనుగుణంగా శానిటేషన్ కార్మికుల నియామకం లేకుండా 'స్వచ్ఛదనం-పచ్చదనం' ఎలా విజయవంతమవుతుందని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మెజార్టీ సభ్యులు అధ్వానంగా మారిన శానిటేషన్‌పై ధ్వజమెత్తారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

స్వచ్ఛదనం-పచ్చదనం ప్రోగ్రాం మొదటి రోజు ఒక్క అధికారి కూడా కనిపించలేదని, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియలేదని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన మాట్లాడే క్రమంలో మరో సభ్యుడు బొట్ల శ్రీనివాస్ పైకి లేవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వారిని చైర్‌పర్సన్ సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం 3వ వార్డు సభ్యురాలు పగిడిపాటి సుధసుగుణాకర్‌రాజు, మహిళా కౌన్సిలర్లు మంత్రి సుమలత, పేర్ని స్వరూప ఉడుగుల శ్రీలత వారి వార్డుల్లోని సమస్యలను తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదు రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్లు వంగళాకల్యాణిమల్లారెడ్డి, లక్ష్మీశ్రీశైలం, అనితవేణుమాధవ్, మల్లేష్, రామచందర్, అరుణ, భూలక్ష్మీనాగరాజు, రమ పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామికి వెండి గంగాళం, చెంబు బహూకరణ



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి వారికి కేజీ 97 గ్రాముల మిశ్రమ వెండి చిన్న గంగాళం, చెంబును భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన భక్తుడు రాయపాటి వెంకట్‌రెడ్డి, వనజ దంపతులు స్వామివారికి సుమారు రూ.1,12,000 విలువైన వెండి గంగాళం అభిషేకం కోసం ఆలయానికి అందజేసినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



నర్మెట: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

నర్మెట: భూ సమస్యల పరిష్కార నిమిత్తం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.మహిపాల్ రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్ కార్యలయంలో సోమవారం నుంచి నూతనంగా ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో రైతుల నుండి వినతులు స్వీకరించిన ఆయన పలు సూచనలు చేశారు. ఈసందర్బంగా పదిమంది రైతుల నుంచి వినతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. డీటీ సీహెచ్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ కలాటి యాదగిరి, ఎంఆర్ఐ సాయిబాబు, అబ్బయ్య , రాజు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలపై రైతుల నుంచి 10 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వేణు పాల్గొన్నారు.

పరామర్శ



జనగామ: ప్రముఖ పుణ్యక్షేత్రం అయోధ్యలో ఇటీవల జనగామ పట్టణానికి చెందిన వ్యాపారి తాళ్లపల్లి నాగరాజు కూతురు తేజశ్రీ సరయూ నదిలోని లక్ష్మీఘాట్ సమీపంలో గల్లంతు కాగా, ఇప్పటి వరకు ఆమె ఆచూకీ లభించలేదు. వారం రోజుల పాటు అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు.. కూతురు కోసం ఎదురు చూసి రెండు రోజుల క్రితం స్వగ్రామం జనగామకు వచ్చారు. ఇంటి నుంచి కుటుంబ సమేతంగా సంతోషంగా తీర్థయాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పుట్టెడు దుఃఖంలో వచ్చారు. తల్లడిల్లి పోతున్న ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. కాగా, సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ పత్కాలంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఇదిలా ఉండగా మహిళా ఎమ్మెల్యేను కించపరిచి మాట్లాడిన ఘటనలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం సమయంలో పోలీసుల పెనుగులాటలో స్వల్పంగా గాయపడ్డ బీఆర్‌ఎస్ నాయకురాలు గంగా భవాని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులు రావెల రవి తల్లి పద్మ మృతిచెందగా, ఇంటింటి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు తాళ్ల సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, బాల్దె కమలమ్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ తది తరులు ఉన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు



ఆందోళన చేస్తున్న రుణమాఫీ కాని రైతులు

లింగాలఘణపురం: అర్హులైన రైతులందరికీ తప్పకుండా రుణమాఫీ అవుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం మండలంలోని నెల్లుట్ల కెనరా బ్యాంకు వద్ద కొంత మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని, జాబితాలో తమ పేర్లు లేవని, నో ఫాండ్ డాటా వస్తుందని ఆందోళన చేశారు. అప్పటికే బ్యాంక్‌కు వచ్చిన లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ డేట్ వరకు రుణాలు తీసుకున్న అర్హులకు తప్పకుండా మాఫీ వర్తిస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులై ఉండి జాబితాలో పేరు లేని వారంతా మండల వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా ఏఓ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి రైతులు ఇబ్బంది పడకుండా అర్హుల వద్ద దరఖాస్తులు తీసుకుని పరిశీలించాలని సూచించారు. ఎల్‌డీఎం మేనేజర్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

'భూ ఆక్రమణకు కుట్రలు'



మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని 174 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, వారికి రెవెన్యూ అధికారులు కూడా సహకరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికానివ్వమని, గుడిసె వాసులకు ప్రభుత్వం పంపిణీ చేసేలా చూస్తామన్నారు. జిల్లా నాయకుడు సుంచు విజేందర్, గుడిసెల భూపోరాట సమితి అధ్యక్షులు పర్వతం నర్సింహులు, రామగళ్ల అశోక్, కంత్రి అయిలయ్య, ఇంజ ఎల్లయ్య, కడకంచి బాల్‌రాజు, కృష్ణ, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

జఫర్‌గఢ్/బచ్చన్నపేట: కేరళ వరద బాధితుల కోసం జఫర్‌గఢ్, బచ్చన్నపేట మండల కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ మేరకు నాయకులు బచ్చన్నపేటలో రూ.15వేలు, జఫర్‌గఢ్‌లో రూ.4,330 విరాళాలు సేకరించి పంపించారు. ఆయా కార్యక్రమాల్లో రాపర్తి సోమయ్య బాల్ నారాయణ, బలరాములు, అయిలయ్య, ప్రభాకర్, విజయ్ పోచమ్మ పాల్గొన్నారు.

పనుల కోసం ఎవ్వరికీ డబ్బులు ఇవ్వొద్దు



కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: పనుల కోసం ప్రజలు మధ్యవర్తులు, రాజకీయనాయకులు, అధికారులు ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, ఏమైనా సమస్యలుంటే నేరుగా బాధితులు నా వద్దకు రావొచ్చని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రం, జఫర్‌గఢ్ మండల పరిషత్ కార్యాలయాల్లో సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కడియం చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని, నీతి, నిజాయతీగా పాలన ఉంటుందని నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా అందరూ పనిచేయాలన్నారు. ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అధికారులు, ప్రజలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, తహసీలార్లు వెంకటేశ్వర్లు, శంకరయ్య, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓలు మధుసూదన్, సుమన్, ఎంఆర్‌ఐ రవీందర్, మాజీ ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఇక్కత్ పట్టు చీరలను కాపీ కొడుతున్నారు

- ప్రింట్‌ను నిషేధించండి
- పోరుబాటకు సిద్ధమవుతున్న నేత కార్మికులు
- నేడు జనగామ పట్టణంలో మహా ర్యాలీ



సమావేశంలో కార్మిక సంఘ ప్రతినిధులు

జనగామ: నేత కార్మికుల పొట్టగొడుతూ చేనేత ఇక్కత్ పట్టుచీరలపై డిజైన్ల ప్రింటును నిషేధించాలని కోరుతూ కార్మిక లోకం రోడ్డెక్కేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నేత వృత్తిపై ఆధారపడ్డ లక్షలాది మంది నేత కార్మికులను రోడ్డున పడేసే విధంగా ప్రైవేటు కంపెనీలు వ్యవహరిస్తున్నా.. పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో చేనేత పరిరక్షణ పేరిట నేత కార్మికులు కదంతొక్కుతున్నారు. రాష్ట్రం, ఢిల్లీ వరకు తమ నిరసన గొంతుకను వినిపించేందుకు నేడు (మంగళవారం) జిల్లా కేంద్రంలో మహా ర్యాలీకి పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చే వందలాది మంది నేత కార్మికుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి చేయనున్నారు. ఇక్కత్ డిజైన్లు ప్రింట్ ఔట్‌ను అరికట్టేందుకు జిల్లాలోని ప్రతి కార్మికుడు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోరాడితేనే.. భవిష్యత్

నేత కార్మికులు మగ్గంపై మూడు నుంచి నాలుగు రోజుల పాటు రెక్కలను ముక్కలు చేసుకుని అందమైన డిజైన్లతో పట్టుచీరలను తయారు చేస్తున్నారు. దేశ, విదేశాల్లో పోచంపల్లి పట్టుచీరలకు మంచి డిమాండ్ ఉంది. దీనిని ఆసరా చేసుకున్న కొంత మది బడా కంపెనీలు పట్టుచీరలపై యంత్రాల సాయంతో అచ్చం పోచంపల్లిని తలదన్నే రీతిలో ప్రింట్ చేస్తుండడంతో చేనేత రంగంపై చీకటి కమ్ముకునే పరిస్థితి నెలకొంది. చేనేత రంగాన్ని కాపాడేందుకు పాలక ప్రభుత్వాలు అండగా నిలువాలని నేత కార్మికులు కోరుతున్నారు. నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే మహార్యాలీకి సంబంధించి వీవర్స్ కాలనీలో నేత కార్మికులు సమావేశమయ్యారు. ర్యాలీకి జిల్లా నలుమూలల నుంచి తరలిరావాలన్నారు.

ది క్లాత్ మర్చంట్ జిల్లా అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు

జనగామ: ది క్లాత్ మర్చంట్ జిల్లా అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఎన్నికల అధికారి నాగబండి రవీందర్, బజాజ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అసోసియేషన్ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా ఎండీ అన్వర్, గౌరవ అధ్యక్షుడిగా గాడిపెల్లి బాలరాజు, అధ్యక్షుడిగా భోగ కైలాసం, ప్రధాన కార్యదర్శిగా ఆమంచ రవి, కోశాధికారిగా గాడిపెల్లి కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులుగా దారం నరేష్, కారంపూడి శ్రీనివాస్, పంకజ్ బజాజ్, కొడితాల చంద్రమోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

బచ్చన్నపేట రెడ్డి యూత్ సంఘం..



ఎన్నికైన బచ్చన్నపేట రెడ్డి యూత్ సంఘం

బచ్చన్నపేట: బచ్చన్నపేట రెడ్డి యూత్ సంఘాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందిపెల్లి రాజురెడ్డి, ఉపాధ్యక్షుడిగా వడ్డెపల్లి యాకంరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పడిగల కర్ణాకర్‌రెడ్డి, కవ్వం రాజిరెడ్డి, కోశాధికారిగా అట్ల సందీప్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా లక్కిరెడ్డి చంద్రారెడ్డి, సలహాదారులుగా జిల్లెల్ల దుర్గాప్రసాద్‌రెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, కవ్వం కర్ణాకర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడుతానని అన్నారు.

హామీలను నెరవేర్చాలి

నర్మెట: దళితులకిచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, దళితమోర్చా మండల అధ్యక్షుడు బుచ్చాల కొంరెల్లి అన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే, దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సూచనమేర పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం తహసీల్దార్ ఎం. మహిపాల్‌రెడ్డికి అందజేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ విజయ్, మండల ఉపాధ్యక్షుడు చెవుల రాజు, ఓబీసి మోర్చా మండల అధ్యక్షుడు రామగుండం యాదగిరి, పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలి

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ అభయహస్తం కింద ప్రతి ఎస్సీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం, డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

జీడీ రమేశ్‌కు డాక్టరేట్



చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన జీడీ ఎల్లమ్మ-వెంకటయ్యల చిన్నకుమారుడు జీడీ రమేశ్ సోమవారం డాక్టరేట్ పొందారు. కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ అయిన రమేశ్ తెలుగు విభాగంలో కె.కె రంగనాథాచార్యుల 'రచనలు-ఒక అధ్యయనం' అనే అంశంపై ఆచార్య ఏటూరి జ్యోతి పర్యవేక్షణలో పరిశోధన చేసి విలువైన సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించాడు. దీన్ని పరిశీలించిన కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి రమేశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ డాక్టరేట్ పొందడం సంతోషంగా ఉందన్నారు. కాగా, రమేశ్‌ను గ్రామ అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, డాక్టర్ చిర్ర సుమన్, సెరెన్డియా గ్రూపు నిర్వాహకుడు జీడీ జాన్‌తోపాటు తదితరులు అభినందించారు.


వ్యసనాలకు బానిసకావొద్దు

జఫర్‌ఘడ్: యువత వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై బి.రాంచరణ్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కూనూరులో పోలీసు జాగృతి బృందంచే కళాజాతా నిర్వహించి అవగాహన కల్పించారు. ఏఎస్సై నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొమ్మూరిని కలిసిన న్యాయవాదులు

జనగామ: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్‌సెల్ న్యాయవాదులు సోమవారం పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు పార్టీ లీగల్ సెల్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. లీగల్ సెల్ చైర్మన్ నాగరాజ శర్మ, వైస్ చైర్మన్ కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

కరాటేలో మోడల్ స్కూల్ విద్యార్థికి బంగారు పతకం



రఘునాథపల్లి: కరీంనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో చదువుతున్న రఘునాథపల్లి గ్రామానికి చెందిన పి.సిద్ధార్థ గౌతమ్ 13 సంవత్సరాల బాలుర కటాస్ విభాగంలో ప్రతిభకనబరిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వాసం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి సిద్ధార్థ గౌతమ్‌ను అభినందించారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా

కొడకండ్ల: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మైదంచెరువుతండాకు చెందిన దస్మ, రామన్నగూడేనికి చెందిన కుమార్‌లకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పవు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో బదిలీలు తప్పవని ఘన్‌పూర్ నుంచి బదిలీపై వెళ్తున్న సీఐ ముస్కు రాజు అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ సీఐగా విధులు నిర్వహించిన ముస్కు రాజు హైదరాబాద్‌కు బదిలీ కాగా ఘన్‌పూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఆయనకు సోమవారం సన్మానించారు.

ఉచిత కరెంట్‌పై హర్షం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్‌ను అందజేయడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: బమ్మెర గ్రామానికి చెందిన మంద ఎల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, సోమవారం 1993-94 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 15 వేల సాయం అందజేశారు.

తల్లి పాలు శ్రేష్టమైనవి



కొడకండ్ల/దేవరుప్పుల/రఘునాథపల్లి/ పాలకుర్తి: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. సోమవారం పలు మండల కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: సంక్షేమ హాస్టలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించి విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2,500 పెంచాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం, పల్లెర్ల లలిత, యాదగిరి, రమేష్, కృష్ణ, సుల్తానా, మంజుల పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

జనగామ రూరల్: పట్టణంలోని ప్రెస్టెన్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి 12 తులాల వెండిని అపహరించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. అశోక్ నాయక్, పాలడి దేవల కుటుంబాలు ప్రెస్టెన్ కాలనీలో కిరాయికి ఉంటున్నాయి. కాగా, శుక్రవారం ఇంటికి తాళం వేసి సొంతూరుకు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తీసి ఉండటంతో లోనికి వెళ్లి చూసేసరికి వెండి అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకరి రిమాండ్

చిల్పూరు: అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మోటం దేవేందర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. దేవేందర్ గతంలో రామగుండం కమిషనరేట్ పరిధి ధర్మారం , బసంత్‌నగర్, సుల్తానాబాద్‌లలో రేషన్ బియ్యం దందా చేస్తూ పట్టుబడ్డాడు. ఇటీవల కాజీపేట, మడికొండల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ రాజవరంలో 160 క్వింటాళ్ల నిల్వ ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు ఆదివారం దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరుస చోరీలపై సీసీఎస్ ప్రత్యేక బృందం విచారణ



సాక్షి ఎఫెక్ట్..

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న వరుస చోరీలపై సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'వరుస చోరీలపై బెంబేలు' కథానికి పోలీసులు స్పందించారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సోమవారం విచారణ చేపట్టింది. మండలంలోని గూడూరు, పాలకుర్తి, బమ్మెర గ్రామల్లో జరిగిన చోరీలపై పోలీసులు, సీసీఎస్ టీం సభ్యులు ఆధారాలతో పాటు దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్: పట్టణంలోని బతుకమ్మకుంటలో అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బైరు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం సీఐ రఘుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మేడ శ్రీనివాస్, సిద్ధం శివ, పిట్టల సురేష్, దుర్గేష్, వెంపటి అజయ్ పాల్గొన్నారు.